క్లుప్తంగా

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు

14వరకు గడువు

కౌడిపల్లి(నర్సాపూర్): రాజీవ్ యువ వికాసం కోసం సబ్సిడీ రుణాలకు ఈనెల 14వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 257 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో బీసీ 150, ఎస్సీ 71, ఎస్టీ 27, ఈబీసీ 3, మైనార్టీ 5, వికలాంగులు ఒకటి దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తు గడువుకు 5వ తేదీ ఆఖరు కాగా, ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 14వరకు పొడిగించిందని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం రెండు పాస్ ఫొటోలతో ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు పత్రాలను సమర్పించాలని సూచించారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్‌లో గల పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు అన్నారు. బుధవారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి ఇన్‌చార్జ్ తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నం. 2లో కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకుని పేదలు నివసిస్తున్నారని, వారికి అధికారులు ఎలాంటి సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం వారున్న స్థలంలో నిర్మాణాలు చేపడితే అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. కొంత మందికి స్థలం కేటాయించినప్పటికీ, పొజిషన్ చూపలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేశం, శేఖర్, వెంకటేశ్, ఏసుదాసు, లక్ష్మణ్, దుర్గాదాసు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్‌కు నివాళి


పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నాయకులు

నర్సాపూర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రమేష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, నారాయణరెడ్డి, శంకర్, నగేష్, రాజు, రాంరెడ్డి, రాంలునాయక్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీకి కుర్చీల వితరణ


కుర్చీలను అందజేస్తున్న ఎన్ఆర్ఐ చంద్రశేఖర్

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మధిర గ్రామమైన కుర్మపల్లి అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ కుర్చీలను బహుకరించారు. బుధవారం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అల్ఫాబెటికల్స్ ఉన్న కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రేణుక, గ్రామస్తులు రాజు, శ్రీమన్, స్వామి, లింగం, రాములు, మల్లేశ్ పాల్గొన్నారు.

జీతాలిస్తేనే విధులకు..


కార్యదర్శికి నోటీసు అందజేస్తున్న కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు 4 నెలలుగా జీతాలు రాలేదని, జీతాలు ఇస్తేనే పనుల్లోకి వస్తామని పంచాయతీ కార్యదర్శి ప్రియాంకకు బుధవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ నెల నెలా జీతాలు ఇవ్వకపోతే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 10 లోగా వేతనాలు ఇవ్వాలని, లేనిచో 19 నుంచి విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక మండల ఉపాధ్యక్షులు స్వామి, కార్మికులు ప్రవీణ్, వీరేశ్, నర్సిహులు, కృష్ణ, రాములు తదితరులున్నారు.

వాగులను తోడేస్తున్నారు..

- ఇసుక అక్రమ తవ్వకాలు
- పలుచోట్లకు రవాణా, డంపింగ్
- టిప్పర్ల రాకపోకలతో పాడవుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు
- పోలీసులు, తహసీల్దార్‌కు రైతుల ఫిర్యాదు


శభాష్‌పల్లి వాగులో ఇసుక తవ్వకాలు..


వెంకటాపూర్ గ్రామ శివారులో ఇసుక డంప్

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా, వాల్టా చట్టానికి విరుద్ధంగా వాగులో నుంచి ఇసుక మాఫియా అర్ధరాత్రి వేళల్లో తవ్వకాలు చేస్తున్నారు. మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామ శివారు వాగులో హిటాచీ ద్వారా ఇసుక తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. గ్రామానికి చెందిన కొందరు తూప్రాన్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఇసుక వ్యాపారితో కుమ్మక్కై వాగు నుంచి ఇసుకను తోడేస్తున్నారు. పలు ప్రాంతాలకు రవాణా చేయడంతో పాటు వెంకటాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో పెద్ద ఎత్తున డంప్ చేశారు. రెండు రోజుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ తవ్వకాలు జరుపుతున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు గ్రామస్తులు వాపోయారు. పంట పొలాల వెంట ఇసుక టిప్పర్లు వెళ్లడంతో పంటలు సైతం పాడైపోయాయని పలువురు రైతులు ఆరోపించారు. ఫస్ట్ క్వాలిటీ ఇసుకను రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ, సెకండ్ క్వాలిటీ ఇసుకను డంప్ చేసి ఫిల్టర్ అనంతరం అమ్ముతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్న మాఫియాపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతుల ఫిర్యాదు..

వాగులో నుంచి రాత్రి వేళల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకొని సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు రైతులు బుధవారం తహసీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తవ్వకాల గురించి ప్రశ్నిస్తే దాడులు చేసేందుకు వస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మున్నూరు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బట్టి ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో హైదరాబాద్‌లో బహిరంగ సభ ఉంటుందని, మున్నూరు కాపులు ఆర్థికంగా ఎదగడంతో పాటు రాజకీయంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షుడు సుభాష్, ప్రధాన కార్యదర్శి రాధాకిషన్, ఎల్లయ్య, రాములు, మోహన్ తదితరులున్నారు.

అగ్గి తెగులుపై అప్రమత్తంగా ఉండాలి


రైతులకు సూచనలు చేస్తున్న ఏఈఓ రాజశేఖర్

కొల్చారం(నర్సాపూర్): ప్రస్తుతం మండలంలో వరి పంటపై అగ్గి తెగులు(మెడ విరుపు) వ్యాప్తి ఎక్కువగా కనిపిస్తుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఏఓ శ్వేతాకుమారి, రంగంపేట ఏఈఓ రాజశేఖర్ సూచించారు. బుధవారం వరి పంటకు తెగులు సోకిన ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తెగులు సోకిన వరి పంటకు నత్రజని సంబంధిత ఎరువులు వేయకూడదని సూచించారు. వ్యాధి ప్రాథమిక దశలో ఉన్న పంటపై ట్రై సైక్లోజోల్ 120 గ్రాములు ఎకరాకు, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే అజయ్ స్ట్రోబిన్, డైఫెనోకొనజోల్ 200 మిల్లీలీటర్లు తీసుకొని ఎకరా పంటకు పిచికారి చేసినట్లయితే వ్యాధి నియంత్రణలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యేలు


మల్లన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యేలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లో మల్లన్న దేవాలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం మాజీ ఎమ్మెల్యేలు తూంకుంట నర్సారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు మల్లన్నను దర్శించుకున్నారు. అంతకు ముందు దేవాలయం వద్ద రేణుకా ఎల్లమ్మ కల్యాణం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి , మల్లారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు అభినందన


ఉత్తమ సేవలందించిన డ్రైవర్లు, కండక్టర్లను సన్మానించిన డిపో అధికారులు తదితరులు

నర్సాపూర్: డిపోలో ఉత్తమ సేవలందించిన కండక్టర్లు, డ్రైవర్లను సన్మానించినట్లు డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. బుధవారం డిపో ఆవరణలో డిపోలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలందించిన డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులు అందజేసి సన్మానించారు. సన్మానం పొందిన వారిలో నాగమణి, రాజేశ్వరి, యాదగిరి, ముర్షద్, మురళీ, జమీల్‌మియా, శంకరయ్య, చంద్రయ్య, మధుసూదన్, కృష్ణస్వామి ఉన్నారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జ్ లక్ష్మణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు అంకురార్పణ

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 6న జరగనున్న శ్రీ రామనవమి ఉత్సవాలకు బుధవారం అంకురార్పణ కార్యక్రమాన్ని ఆలయ పురోహితులు ప్రారంభించారు. ఆలయ ఆవరణలో గణపతి హోమం, పుణ్యాహవచనం, వాస్తు పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారం రోజుల పాటు పల్లకీ సేవ, అభిషేకాలు, ఎదుర్కోలు, కల్యాణమహోత్సవం, గరుడసేవ తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ అధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో పురోహితులు గుడి చంద్రశేఖరశర్మ, సంతోష్ శర్మ, నాగరాజశర్మ, రామాచారి, రాకేష్‌శర్మ, శ్రీనాథ్‌శర్మ తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజాపాలనతో ప్రజలకు మేలు జరుగుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో మండలంలోని శేరిపల్లి, జప్తిశివనూర్, శంఖాపూర్ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి తహసీల్దార్ షేక్ కరీం, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు రాజేశ్, బాచి, లక్ష్మినర్సింహులు, నర్సింహులుగౌడ్, బాలాజి, రుక్మోద్దీన్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ తీసుకోండి

నిజాంపేట(మెదక్): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్య బోధన నిర్వహిస్తున్నారని బుధవారం నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలోని పదవ తరగతి విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు రమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ తీసుకోవాలని, అలాగే వసతులను విద్యార్థులకు వివరించారు. కళాశాలలో వస్తున్న ఫలితాలను విద్యార్థులకు తెలియజేశారు. విశాలమైన తరగతి గదులతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి, శివ పార్వతుల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవదేవుడి కల్యాణ మహోత్సవాన్ని ఆసక్తిగా తిలకించారు. మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వెంకటేశ్వరస్వామి, శివపార్వతుల, నవగ్రహాలకు పంచామృత అభిషేకాలతో పాటు ఆంజనేయస్వామికి సింధూర పూజ నిర్వహించినట్లు ఆలయ పూజారి గిరీశ్వరశర్మ పేర్కొన్నారు. వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

రామాలయ పునఃనిర్మాణానికి విరాళాలు


ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయకమిటీ సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలో పురాతన శ్రీరామాలయం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ అధ్వర్యంలో ఇంటింటి నుంచి విరాళాల సేకరణ బుధవారం ప్రారంభించారు. ఈ నెల 21 నుంచి 23 వరకు నూతన ఆలయంలో పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ ఇంటికీ ఆలయ కమిటీ బృందం ఆహ్వాన పత్రిక అందజేస్తూ విరాళాలను సేకరిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కనకరాజు, సభ్యులు శ్రీనివాస్, మురళిపంతులు, ఆర్ఎస్. సంతోష్, సత్యనారాయణ, రవీందర్, గంగారెడ్డి, సిద్ధు, శ్రీను, సుభాష్‌గౌడ్, విఠల్‌రెడ్డి, సీతారం, అనిల్, సర్వేశ్వర్, సతీష్‌గౌడ్, సాయిలు, సంతోష్ తదితరులున్నారు.

బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు


మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ.శంకర్

పెద్దశంకరంపేట(మెదక్): ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దని ఎస్ఐ.శంకర్ ప్రజలకు సూచించారు. బుధవారం పెద్దశంకరంపేటలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజలకు ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాలు, బ్యాంకుల పేరుతో మోసాలు, దొంగతనాలు, నేరాలపై అవగాహన కల్పించారు. యువకులు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ప్రకటనలకు ఆకర్షితులు కావద్దని, అనవసర లింక్‌లను ఓపెన్ చేయవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ. సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

సన్న బియ్యం.. సంతోషం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. లబ్ధిదారులు లైన్‌లో నిల్చుని మరీ ఆనందంగా తీసుకున్నారు. ఇక నుంచి బయట కొనుగోలు చేయవలిసిన అవసరం లేదంటూ సంతోషం వ్యక్తం చేశారు.


మనోహరాబాద్ : సన్నబియ్యాన్ని ప్రారంభిస్తున్న గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, అధికారులు, నాయకులు


టేక్మాల్: సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న తహసీల్దార్ తులసీరామ్, నాయకులు


రేగోడ్: సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో రాయగిరి వెంకటేశ్వరస్వామి జాతర ఘనంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ పూజారులు ఆలయ మండపంలో స్వామి తిరుకల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్ధరాత్రి రావణాసుర ప్రతిమతో లంకాదహనం చేసి రథం ఊరేగించారు. బుధవారం ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, గ్రామస్తులు, భక్తులు, భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు


చిలప్‌చెడ్‌లో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ గ్రామంలో గల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా గంగమ్మతల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మహిళలు బోనాల తీసుకొని డప్పుచప్పుళ్ల, పోతురాజుల విన్యాసాలు మధ్య ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


చిన్నశంకరంపేటలో దుర్గామాతకు బోనం తీసుకెళ్తున్న మహిళలు

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఉగాది సందర్భంగా మూడురోజుల పాటు నిర్వహించిన దుర్గామాత ఆలయ ఉత్సవాల్లో మహిళలు అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన పది పరీక్షలు


నర్సాపూర్ రూరల్: పరీక్ష కేంద్రం నుంచి సంతోషంగా బయటకు వస్తున్న విద్యార్థులు


చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులపై లాఠీఛార్జి అమానుషం

పాపన్నపేట(మెదక్): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లపై పోలీసులు లాఠీఛార్జి చేయడం అమానుషమని ఆర్ట్స్ కాలేజీ మాజీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెత్తు పోకడ మానుకోవాలన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్‌లో రూ 7.50 లక్షలతో సీసీ రోడ్డు పనులను గ్రామ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావ్, ఉపాధ్యక్షుడు రఘు, మండల బీసీసెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖులు, గ్రామ అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు పోచాగౌడ్, నల్లపోచమ్మదేవి ఆలయ కమిటీ డైరెక్టర్ శంకర్‌గౌడ్, గంగారాం, రాజేశ్వరరావ్ పాల్గొన్నారు.

◆ విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): సీపీఎం, హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు పెట్టిన కేసులు, అక్రమ అరెస్టులను సీపీఎం కార్యదర్శి నాగరాజు ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ప్రధాన రహదారిపై ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేశం, శేఖర్, అజయ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

◆ కాళ్లకల్ తైబజార్ వేలం రూ.6 లక్షలు

మనోహరాబాద్(తూప్రాన్): రెండేండ్లుగా వాయిదా పడుతున్న కాళ్లకల్ తైబజార్‌ను ఎట్టకేలకు గ్రామానికి చెందిన వారు దక్కించుకున్నారు. బుధవారం గ్రామ పంచాయతీలో ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వేలం పాట నిర్వహించగా చీర్ల ఇంద్రసేనా యాదవ్ రూ. 6 లక్షల 5 వేలకు దక్కించుకున్నారు.

◆ చలివేంద్రం ఏర్పాటు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ వేదిక అధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం చలివేంద్రాన్ని జిల్లా అధ్యక్షుడు గరుగుల నర్సింహులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిమెన్ సిలారి, మడూర్ అధ్యక్షుడు శంకర్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ పనులు త్వరగా పూర్తి చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి హామీలో నిర్దేశించిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని శభాష్‌పల్లిలో జరుగుతున్న పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉదయం వేళల్లో పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వీణకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ దామోదర్ ఉన్నారు.

◆ పార్కు చేసిన మోపెడ్ చోరీ

నర్సాపూర్: ఇంటి ముందు పార్కు చేసిన మోపెడ్‌ను ఎత్తుకెళ్లిన ఘటన నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నర్సాపూర్‌లోని 11వ వార్డులోని చర్చి వెనుక వీధిలో ఉంటున్న దుర్గయ్య తన ఇంటి ఆవరణలో మోపెడ్‌ను పార్కు చేశాడు. మంగళవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ విద్యార్థులకు షీ టీమ్‌పై అవగాహన

నర్సాపూర్ రూరల్: మహిళలను ఎవరైనా ఇబ్బంది పెడితే షీ టీమ్‌ను ఆశ్రయించాలని బృంద సభ్యులు దేవదాస్, స్వరూప సూచించారు. బుధవారం నర్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులు పెడితే వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.